రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అక్రమ అరెస్టులు అన్యాయం
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే కిరణ్, నాయకులు



రణస్థలం: చిలకపాలెంలో ప్రజలకు చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం :

రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ అరెస్టులతో ప్రజా స్వామ్యం ఖూనీ అయ్యిందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. సంక్షేమ పథకాలు అందక పేదలు ఇబ్బందులు పడుతూ వలసపోతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, చేస్తున్న పనులకు, చెబుతున్న మాటలకు ఎక్కడా పొంతన ఉండటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే బాధ్యత కార్యకర్తలు, నాయకులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరామ్ రెడ్డి, డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ ప్రతినిధి జరుగుళ్ల శంకర్, జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ కొత్తకోట్ల సూర్యారావు, నాయకులు ముద్దాడ శంకర్, మాడుగుల జగదీష్, పైడి శ్రీనివాసరావు, డొంక వెంకటరమణ, చిలక సన్యాసప్పడు, డొంక అప్పలరాజు, తండ్యాల లక్ష్మణరావు, సీరపు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోసగించడమే చంద్రబాబు నైజం



గార: కె.మత్స్యలేశంలో బూటకపు హామీలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు



గార: కళింగపట్నంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గార: అబద్ధపు హామీలివ్వడంతో గద్దెనెక్కి తర్వాత మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గార మండలం కె.మత్స్యలేశం పంచాయతీలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయని తీరును క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, పీస శ్రీహరి రావు, యాళ్ల నారాయణమూర్తి, బరాటం నాగరాజు, గుంటు రామచంద్రరావు, బత్తుల గోవిందరావు, పప్పు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కళింగపట్నంలో..

చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. కళింగపట్నం పంచాయతీ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవింద రాజులు (పీస గోపి) అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు అంధవరపు బాలకృష్ణమూర్తి, సర్పంచ్ తమ్మిన అప్పలరాజు, కొయ్యాన నాగభూషణం, గుజ్జల అప్పలరాజు, వమరవల్లి ఉదయభాస్కరరావు, దీర్ఘాశి వీర్రాజు, గిన్ని అప్పలరెడ్డి, కిల్లి రఘు, చాట్ల రవి, వమరవల్లి వెంకటరావు, భైరి మోహన్, గయా లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు



రణస్థలం: జీరుపాలెంలో చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: చంద్రబాబు పాలనలో ప్రజలకు ష్యూరిటీ లేదని, మోసం మాత్రమే గ్యారెంటీగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండలం జీరుపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మహిళలకు రూ. 1500 ఇస్తామని చెప్పి నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు. గంగపుత్రుల కళ్లలో కాంతులు నింపడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎచ్చెర్ల మండలంలో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం తలపెడితే అది కూడా సగంలోనే కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేతల కృష్ణ, సర్పంచ్ మాగుపల్లి రాము, నాయకులు బొమ్మలాట శ్రీరాములు, దన్నాన సీతారం, టేకి బ్రహ్మాజీ, గోవిందాసు సాయి తదితరులు ఉన్నారు.

ఆర్షవిజ్ఞాన సుమవల్లి 'ఆరవెల్లి'

- ఉపనిషన్మందిరానికి మూడు దశాబ్దాల పాటు సేవలు
- నేడు తృతీయ వర్ధంతి సభ



ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు



శిష్యులు, బంధువుల సమక్షంలో బంగారు సింహ తలాటంతో సత్కారం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్ : ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆర్ష, సాహిత్యాలలో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్నారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు. అప్పట్లో శ్రీకాకుళంలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమమైనా, ఏ సాహిత్య కార్యక్రమమైనా ఆయన సమక్షంలోనే జరిగేది. గురువుగా ఎంతోమందిని తీర్చిదిద్దిన ఆరవెల్లి తృతీయ వర్ధంతి కార్యక్రమం ఈ నెల 23న ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భాషాభివృద్ధికి కృషి..

వంశధార నదీ తీరం గార మండలం బూరవెల్లి గ్రామంలో 1928 ఫిబ్రవరి 28న ఆరవెల్లి నరసింహాచార్యులు, సీతారామమ్మలకు నాలుగో సంతానంగా జన్మించిన లక్ష్మీనారాయణాచార్యులు బాల్యమంతా బూరవెల్లిలోనే సాగింది. కళింగపట్నంలో మహేంద్రాడ వారింట గురుకుల వాసం చేసి అమరం, ఆంధ్రం, జ్యోతిష్యం, పాంచరాత్రాలను నేర్చుకున్నారు. విజయనగరం మహారాజ సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ చేసి శ్రీకాకుళం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచే సాహిత్యంలో అభిలాషను పెంచుకుని ఉపనిషన్మందిరం అనే ఆధ్యాత్మిక గ్రంథాలయ అభివృద్ధికి, బూరవెల్లి కేంద్రంగా 'సాహిత్య జ్యోత్స్న పరిషత్' వ్యవస్థాపకులుగా వ్యవహరించి వందలాది మంది సాహితీ ఉద్ధండులను పట్టణానికి రప్పించి సాహిత్య, ఆధ్యాత్మిక ప్రసంగాలను అందించారు.

- ఉపనిషన్మందిరం కార్యదర్శిగా ఆరవెల్లి లక్ష్మీనారాయణ సుమారు 30 ఏళ్ల పాటు సేవలు అందించారు. తెలుగుభాష, సంస్కృత భాష వ్యాప్తికి హిందూ సంప్రదాయాలను కాపాడేందుకు ఆర్ష సాహిత్యం, తెలుగు, సంస్కృత భాషాభివృద్ధి, పరిరక్షణ కోసం 60 ఏళ్లుగా చేసిన కృషిని గుర్తిస్తూ 'సింహతలాట' సత్కారం జరిగింది.
- ఆల్ఇండియా రేడియోలో పదేళ్లపాటు ఉదయం 6.30 గంటలకు 'సూక్తి ముక్తావళి' నిర్వహించారు. 2007లో కళింగాంధ్రా సంస్థానీధీశుల కోసం 50 ఎపిసోడ్‌లు ప్రసంగాలు చేశారు.
- ఎనిమిది పదులు దాటిన వయస్సులోనూ ఆధ్యాత్మిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ నిర్వాహకులకు ప్రోత్సాహం అందిస్తూ విశిష్ట సేవలు అందించిన ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు జిల్లాకే గర్వకారణంగా నిలిచారనడంలో సందేహం లేదు. ఈయన 2022 జూలై 27న తుదిశ్వాస విడిచారు. తిథి ప్రకారం నేడు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు.

బీమా పథకాలతో ధీమా



ప్రమాద బీమా చెక్కును అందిస్తున్న ఎల్‌డీఎం శ్రీనివాసరావు, యూబీఐ రీజనల్ హెడ్ రాజా

రణస్థలం/ఎచ్చెర్ల: అర్హులైన ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన వంటి పథకాల్లో నమోదు చేసుకుని జీవితంలో ధీమాగా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రణస్థలం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో బీమా యోజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ ముఖ్య అధికారి పైడిరాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత కల్పించడమే లక్ష్యమన్నారు. అనంతరం ఇటీవల మరణించిన దన్నాన సూర్యనారాయణ కుటుంబానికి రెండు లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎం.మాధవీలత, సీఎఫ్‌లు, బ్యాంక్ మేనేజర్ గౌతమ్ పాల్గొన్నారు. అనంతరం ఎచ్చెర్ల మండలం జర్జాంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల శాఖ ముఖ్య అధికారి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గంగరాజు

గార: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని గార ఎస్‌ఐ సీహెచ్.గంగరాజు అన్నారు. మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ముందు సీట్లో కూర్చోబెట్టడం, ఓవర్ లోడ్‌తో వెళ్లడం, ఆటోల్లో లౌడ్ స్పీకర్లు వేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి చేస్తే జరిమానాలు తప్పని హెచ్చరించారు.

క్లుప్తంగా

బదిలీ ఉద్యోగులకు సత్కారం



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

రణస్థలం: కోష్ట పంచాయతీ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను గ్రామపెద్దలు మంగళవారం పంచాయతీ కార్యదర్శి వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజినాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామునాయుడు, సర్వేయర్ ఈశ్వరరావులకు జ్ఞాపికలు, పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ గోపిబాల, ఎంపీడీవో ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశరావు, వీఆర్వో ఎల్.అప్పలనాయుడు, సర్పంచ్ పి.హరిబాబు, ఎంపీటీసీ పి.అసిరినాయుడు, గ్రామ పెద్దలు పి.జగన్నాథం, పి.అప్పడుదొర, పి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాషువా వర్ధంతి సభ రేపు

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో ఈ నెల 24న సాయంత్రం 5.30 గంటలకు కవి గుర్రం జాషువా వర్ధంతి సభ జరుగుతుందని నిర్వాహకులు అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

సేవలతోనే గుర్తింపు



రోజాను సన్మానిస్తున్న వైద్యాధికారులు

గార: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారులు మనోజ్‌బాబు, మూర్తి అన్నారు. చల్లపేట సచివాలయం ఏఎన్‌ఎంగా పనిచేసిన రోజా పెద్దగణగళ్లవానిపేటకు బదిలీపై వెళ్లడంతో మంగళవారం పీహెచ్‌సీలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవో ప్రభాకర్, సూపర్‌వైజర్ శ్యామ్‌సుందర్, కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ పూజారి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుగుణాకరరావు

రణస్థలం: 2029 సంవత్సరానికి పేదరికం లేని కోటపాలెం గ్రామంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడుతున్నామని విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్ పి.సుగుణాకరరావు అన్నారు. రణస్థలం మండలం కోటపాలెంలో మంగళవారం పీ4 గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 112 బంగారు కుటుంబాలను గుర్తిస్తూ మార్గదర్శకులుగా గ్రామపెద్దలను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ గోపిబాల, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ వి.ప్రకాష్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, సర్పంచ్ గొర్లె జగదీశ్వరరావు, గ్రామ నాయకులు సుంకరి ధనుంజయ పాల్గొన్నారు.

శాకంబరి అవతారంలో లలితాదేవి



శ్రీకాకుళంకల్చరల్: నగరంలోని జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో షిరిడిసాయి సేవా సంఘం దేవాలయంలో లలితాదేవిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిగా అలంకరించారు. అర్చకులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

టి.డి.వలసలో పారిశుద్ధ్య పనులు



ట్రాక్టర్ ద్వారా చెత్త తరలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని టంకాల దిగ్గువలసలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సర్పంచ్ టంకాల జగన్మోహిని పనులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సర్వే చేపట్టారు.

ఐఎస్‌ఓ గుర్తింపుతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వికాశ్ శ్రీఉత్సవ్

ఎచ్చెర్ల : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు రావాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత సంస్థల నుంచి నిధులు, ప్రాజెక్టులు పొందాలన్నా ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్ కీలకమని జేసీ కన్సెల్టెన్సీ సర్వీసెంగ్ (గోరఖ్‌పూర్- ఉత్తరప్రదేశ్) డిప్యూటీ డైరెక్టర్ వికాశ్ శ్రీఉత్సవ్ అభిప్రాయపడ్డారు. ఐఎస్ఓ, గ్రీన్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం వర్సిటీకి విచ్చేసిన అధికారులతో కలిసి మాట్లాడారు. నీటి వనరుల సంరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ఈ–వేస్ పునరుత్పాదన శక్తి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న ఐఎస్ఓ సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

24న పాపులర్ లెక్చర్ సిరీస్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న పాపులర్ లెక్చర్ సిరీస్ జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో బ్రోచర్ ఆవిష్కరించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ న్యూఢిల్లీ సౌజన్యంతో అప్లైడ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఐఐటీ మద్రాసు నుంచి ప్రొఫెసర్ రాయల సురేష్ కుమార్, తెలంగాణలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ప్రొఫెసర్ పొదిలె అప్పారావు, కళాశాల అప్లయిడ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ మధమంచి ప్రదీప్ ముఖ్య వక్తలుగా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. సైన్సెస్‌లో జరుగుతున్న అధునాతన విధానాలపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రదీప్, డాక్టర్ రోణంకి హరిత, పైడి సుధారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో ఏడో రోజు మంగళవారం కూడా సమ్మె కొనసాగింది. దీనిలో భాగంగా కార్మికులు చెవిలో పువ్వులతో, మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముప్పు తెచ్చే కాంట్రాక్టు విధానాన్ని తీసుకొస్తే తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

91 మద్యం బాటిళ్లు స్వాధీనం

రణస్థలం: బెజ్జిపురంలో వద్దిపల్లి రామారావు షాపులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. 91 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని లావేరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రణస్థలం: బెజ్జిపురంలో పాడుబడిన రైస్ మిల్లులో పేకాట ఆడుతున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1,690 నగదు స్వాధీనం చేసుకుని లావేరు పోలీసులకు అప్పగించారు.

బయో టెక్నాలజీతో..
బంగారు భవిష్యత్తు

- శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అందుబాటులో కోర్సు
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఆసక్తి చూపిస్తున్న విద్యార్థులు



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: బయోటెక్నాలజీ మేజర్ సబ్జెక్టుగా (ప్రొగ్రమింగ్‌తో) డిగ్రీ, పీజీ కోర్సులను పూర్తిచేసినవారికి బంగారు భవిష్యత్తు సొంతమౌతుందని డిగ్రీ కాలేజియేట్ అధికారులు చెబుతున్నారు. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి.. నీట్, ఎంసెట్ అర్హత పొందలేకపోయిన విద్యార్థులు.. బయోటెక్నాలజీతో డిగ్రీ చేయటం ద్వారా చక్కటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సమకూర్చవచ్చనే ఉద్దేశంతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(జీడీసీ మెన్) కళాశాలలో కోర్సును ఏర్పాటుచేశారు. బయోటెక్నాలజీ విభాగంతో డిగ్రీలో సింగిల్ మేజర్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్ (3 సంవత్సరాల వ్యవధి), పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)లో మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్ (2 సంవత్సరాల వ్యవధి) లను ప్రారంభించి విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారు. ఈ కోర్సుతో డిగ్రీ, పీజీ పూర్తిచేసిన అనేక మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాల్లో స్థిరపడి రాణిస్తున్నారు. బయోటెక్నాలజీ కోర్సు హెచ్‌ఓడీ/కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.ప్రదీప్ వ్యవహరిస్తుండగా, డాక్టర్ రోణంకి హరిత, పైడి సుధారాణిలు సీనియర్ ఫ్యాకల్టీలుగా పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నారు.

అనేక సంస్థలతో ఒప్పందాలు..

బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ అన్నీ వసతులతో తొణికిసలాడుతోంది. ఉత్తమ ప్రయోగశాల సౌకర్యాలు, ఐసీటీ ఆధారిత తరగతి గదులు, ప్రఖ్యాత పరిశ్రమలు, ఆసుపత్రుల నుంచి ముందస్తు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఉత్తీర్ణత అయిన వెంటనే ఉపాధి కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌ను నిర్వహించడం ద్వారా ప్రస్తుత శాస్త్రీయ, విజ్ఞాన ప్రచారం, అవగాహన కల్పిస్తు.. శ్రీకాకుళం జీడీసీ మెన్ కాలేజ్ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

ఎమ్మెస్సీలోనూ ప్రవేశాలు..

ఏపీ పీజీసెట్–2025 ఎగ్జామ్‌లో క్వాలిఫై అయిన వారు సైతం తమ కళాశాలలో అందుబాటులో ఉన్న ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రాంకి దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులో 20సీట్లు మాత్రమే ఉన్నాయి. ఆసక్తి కలిగినవారు 8555911961 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉపాధికి అవకాశం..



ఇంటర్‌లో బైపీసీ, జీవశాస్త్ర సంబంధ వృత్తి విద్యా కోర్సులలో ఉత్తీర్ణులైనవారు బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసినవారు కేంద్రరాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు శాస్త్ర సాంకేతిక, విద్య, వైద్య, ఫార్మ రంగాలలో ఉపాధి అవకాశాలను పొందవచ్చు.

– డాక్టర్ కణితి శ్రీరాములు, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

సౌకర్యాలు మెండు..



శ్రీకాకుళం జీడీసీ మెన్ కాలేజ్‌లో బయోటెక్నాలజీ విభాగ విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. నిష్ణాతులైన ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ, పీజీ అనంతరం ఉపాధి పొందాలనుకొనే బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌కి దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ మదమంచి ప్రదీప్, బయోటెక్నాలజీ కోర్సు హెచ్‌ఓడీ/కోఆర్డినేటర్

• చల్లని దీవెన కోసం చల్లదనం



ముత్యాలమ్మ ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు





పూజలందుకుంటున్న అసిరితల్లి అమ్మవారు



అసిరితల్లి అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఆషాఢ మాస మంగళవారాన్ని పురస్కరించుకొని నగరంలోని ముత్యాలమ్మతల్లి, మరిడమ్మ, నూకాలమ్మతల్లి, అసిరితల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్రాట్లు సమర్పించి అమ్మవార్లకు చల్లదనం చేశారు. జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, మంగువారి తోట, కాకివీధి, అరసవల్లి, ఖాజీపేట తదితర ప్రాంతాల్లో అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు.

–శ్రీకాకుళం కల్చరల్/అరసవల్లి

ముత్యాలమ్మ మార్కెట్‌లో తనిఖీలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో ఎప్పటి నుంచో ట్రాఫిక్ సమస్యలకు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిన గుజరాతీపేట మెయిన్ రోడ్డులోని ముత్యాలమ్మ మార్కెట్‌ను కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడ్డదిడ్డంగా, రోడ్లను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడంపై నిర్వాహకులపై మండిపడ్డారు.